క్లుప్తంగా

వాహనాల తనిఖీ

కోటపల్లి: 'ఆపరేషన్ కగార్' నిలిపివేయాలని మంగళవారం మావోయిస్టులు ఇచ్చిన బంద్ పిలుపు నేపథ్యంలో మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో ఏసీపీ వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రాణహిత నది మీదుగా నిఘా పటిష్టం చేశామని, శాంతిభద్రతల విషయంలో ప్రజలు పోలీసులకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో చెన్నూర్ సీఐ దేవేందర్‌రావు, ఎస్సై రాజేందర్, స్పెషల్‌పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

సీఎంపీఎఫ్ వడ్డీ రేటు పెంచాలి

మందమర్రిరూరల్: సింగరేణి ఉద్యోగుల భవిష్యనిధి (సీఎంపీఎఫ్) వడ్డీ రేటు పెంచాలని ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం ఏరియాలోని కేకే–5 గనిపై ఆయన మాట్లాడుతూ గతంలో 8.5 శాతం ఉన్న వడ్డీని 8 శాతం కుదించారని, ప్రస్తుతం 7.6 శాతానికి కుదిండంతో ఉద్యోగులకు అన్యాయం జరుగుతుందన్నారు. వెంటనే 8 శాతానికి పెంచాలని కోరారు. ఆయన వెంట ఆ యూనియన్ నాయకులు శ్రీనివాస్, సంపత్, రాజేశ్వర్‌రావు, ప్రేమ్‌రావు ఉన్నారు.

బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడిగా నితీశ్

రామకృష్ణాపూర్: జాతీయ బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడిగా రామకృష్ణాపూర్ పట్టణానికి చెందిన పూరేళ్ల నితీశ్‌ను నియమిస్తూ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రమోహన్‌గౌడ్ మంగళవారం నియామకపు పత్రం అందించారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన బీసీ నాయకులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పారిశుద్ధ్యం మెరుగుపర్చాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మంచిర్యాలటౌన్: గత నస్పూరు మున్సిపాలిటీలో పనిచేసిన పారిశుద్ధ్య కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకుని, పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగుపర్చాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ నాయకులు మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం కార్పొరేషన్ మేనేజర్ విజయ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 120 మందిని తీసేయడం వల్ల పట్టణంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అక్కూరి సుబ్బయ్య, బేర సత్యనారాయణ, వంగ తిరుపతి, మెరుగు పవన్ కుమార్, పంబాల గంగ, కుర్మిళ్ల అన్నపూర్ణ, అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ సిబ్బందికి అవగాహన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ ఎంపీపీ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో ప్రసాద్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, సాంకేతిక నిపుణులు, క్షేత్ర సహాయకులకు ఉపాధి హామీలో భాగంగా నాణ్యమైన పనుల నిర్మాణాలు, మెటీరియల్ వర్క్స్‌లపై అవగాహన కల్పించారు. డీఆర్‌డీవో కార్యాలయం నుంచి కోర్సు డైరెక్టర్ సదానందం, ఎంపీవో ఉమర్‌షరీఫ్, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, ఈసీ శ్రీనివాసరెడ్డి అవగాహన కల్పించారు.

డివిజన్లను సవరించాలి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల కార్పొరేషన్‌లోని డివిజన్లను సవరించాలని కోరుతూ మంగళవారం బీఆర్ఎస్ నాయకులు కార్పొరేషన్ మేనేజర్ విజయ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్ 42లో ఉన్న 19–490 నుంచి 19–500ల వరకు ఉన్న ఇంటి నంబర్లను డివిజన్ 13లోకి మార్చాలని, డివిజన్ 38లో ఉన్న నాగదేవత కాలనీలోని 23–215/4 నుంచి 23–225/1–89 వరకు ఉన్న ఇంటి నంబర్లను డివిజన్ 39కి మార్చాలని, డివిజన్ 39లో ఉన్న శ్రీకృష్ణ కాలనీ 23–220 నుంచి 23–225/1–42/ఏ/2 వరకు ఉన్న నివాస గృహాలను డివిజన్ 38లోకి మార్చాలని, డివిజన్ 43లోని రాంనగర్, ఎల్ఐసీ కాలనీ, ఐబీ ఏరియా, 19–1 నుంచి 19–183తో పాటు, 19–202 నుంచి 19–208 వరకు, 18–407లో ఉన్న అన్ని ఇంటి నంబర్లు, 18–554 నుంచి 18–715 వరకు ఉన్న ఇంటి నంబర్లను డివిజన్ 44లోకి మార్చాలని కోరారు. డివిజన్ 54లో ఉన్న గాంధీనగర్ 28–136/1–1 నుంచి 28–136/253 వరకు ఉన్న ఇళ్లను డివిజన్ 22లోకి మార్చాలని, డివిజన్ 22లో ఉన్న గోపాల్‌వాడను డివిజన్ 54లోకి మార్చాలని కోరారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అంకం నరేశ్, ఎర్రం తిరుపతి, తాజ్, పడాల రవీందర్, బొట్ల సత్యనారాయణ, గోగుల రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

కూలిన సెప్టిక్ ట్యాంక్

- వర్షం పడితే ఇళ్లలోకి మురుగునీరు
- దుర్గంధంతో ఇబ్బంది పడుతున్న కాలనీ వాసులు



ఇళ్ల మధ్య నిలిచిన మురుగునీరు

శ్రీరాంపూర్: సింగరేణి సెప్టిక్ ట్యాంక్ కూలి కాలనీ మొత్తం దుర్గంధం వెదజల్లుతోంది. శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 6 కాలనీ సీ టైప్ క్వార్టర్ల ముందు ఉన్న ప్రైవేటు కాలనీలో సింగరేణి సెప్టిక్ ట్యాంక్ పగిలి, పై కప్పు కూలిపోయింది. ఆర్కే 6 కాలనీలోని సీ, డీ సెక్టార్ క్వార్టర్లకు సంబంధించిన మరుగుదొడ్ల నుంచి వచ్చే మురుగు నీరంతా ఇక్కడి సెప్టిక్ ట్యాంక్‌లోకి వచ్చి చేరుతుంది. అక్కడి నుంచి కాలువ ద్వారా దిగువ ప్రాంతానికి నీరు వెళ్తుంది. ఈ ట్యాంక్‌ను ఆనుకుని జాతీయ రహదారి నిర్మాణం జరిగింది. దీని నిర్మాణ సమయంలో ట్యాంక్‌స్లాబ్ పగిలి కూలిపోయింది. అప్పటికే కొంతమేర స్లాబ్ పగిలిపోగా రహదారి నిర్మాణ పనుల సందర్భంగా పూర్తిగా పగిలి కూలిపోయింది. దీంతో పైనుంచి సీ, డీ సెక్టార్ల నుంచి వచ్చే మురుగునీటితో పాటు పక్కనే దీనికి ఆనుకుని ఉన్న ప్రైవేటు కాలనీ నివాసాల నుంచి వచ్చే మురుగునీరు సెప్టిక్ ట్యాంకులోకి చేరక ట్యాంక్‌పై నుంచి పొంగి పొర్లుతోంది. దీంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది.

వర్షానికి మురుగునీరు రివర్స్

వర్షం పడిదంటే కాలనీ నుంచి వచ్చే మురుగు నీరు, ప్రైవేటు ఇళ్ల నుంచి వచ్చే వర్షపునీరు ట్యాంక్‌చుట్టూ నిలిచిపోతుంది. కాస్త ఎక్కువ వర్షం పడితే ఆ మురుగునీరు ఇళ్లలోకి రివర్స్ రావడంతో ఈగలు, దోమలు వ్యాప్తి చెందుతున్నాయని వాపోతున్నారు. ఇక పందుల స్వైర విహారం చెప్పనక్కర్లేదన్నారు. ట్యాంక్ కూలిన పక్క నుంచి కనీసం ప్రత్యేక డ్రైన్ ఏర్పాటు చేస్తే మురుగు నీరు, వర్షపు నీరు దిగువ ప్రాంతానికి చేరుతుందని ఆ ఏర్పాట్లు కూడా చేయడం లేదని కాలనీ వాసులు వాపోతున్నారు.

పట్టించుకోని అధికారులు..

ఈ సమస్యలపై ఇప్పటికీ సంవత్సర కాలంగా మూడుసార్లు సింగరేణి అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని కాలనీవాసులు పేర్కొంటున్నారు. వారు వచ్చి చూసి వెంటనే బాగు చేయిస్తామని చెప్పి వెళ్లడం తప్ప ఎలాంటి ప్రయోజనం లేదని వాపోతున్నారు. ఈ మురుగునీటికి రోగాలు వస్తే బాధ్యులెవరని ప్రశ్నిస్తున్నారు. కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు.

రోగాల బారిన పడుతున్నాం



మురుగునీరంతా కాలనీ మధ్యలోకి వచ్చి చేరుతోంది. దీంతో భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. వర్షం కురిస్తే మురుగు నీరు ఇళ్లలోకి రివర్స్ వస్తోంది. పలుమార్లు సింగరేణి అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి. – హరీశ్, కాలనీవాసి

సమస్య పరిష్కరిస్తాం..

ట్యాంక్ పగిలిపోయి ఇబ్బందికరంగా మారింది వాస్తవమే. ఈ సమస్య మా దృష్టికి వచ్చింది. పక్క నుంచి ప్రత్యేక కాలువ తవ్వించి మురుగు నీటిని దిగువ ప్రాంతానికి పంపించే ఏర్పాట్లు కొద్ది రోజుల్లోనే పూర్తిచేస్తాం.

– ఆనంద్‌కుమార్, డీజీఎం(సివిల్), శ్రీరాంపూర్

క్షయరహిత సమాజ నిర్మాణం అందరి బాధ్యత



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు, సిబ్బంది

నస్పూర్: క్షయ రహిత సమాజ నిర్మాణం అందరి బాధ్యత అని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్ అన్నారు. ఆయుష్మాన్ భారత్, మిషన్ భారత్ అభియాన్ ఇంటిగ్రేటెడ్ హెల్త్ క్యాంపును నస్పూర్ మున్సిపల్ పాత కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు ఉన్నట్‌లైతే క్షయ వ్యాధిగా అనుమానించి తెమడ పరీక్ష చేయించుకోవాలన్నారు. తుంపర్ల ద్వారా సైతం ఈ వ్యాధి వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందువల్ల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ మెడికల్ ఆఫీసర్ వెంకటేశ్, ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారి రఘు, అధికారులు అల్లాడి శ్రీనివాస్, రమేశ్,సురేందర్, సాయిరెడ్డి, సిబ్బంది శ్రీలత,పుష్ప, స్వాతి, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

బీపీ మండల్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలి

పాతమంచిర్యాల: బీపీ మండల్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పోస్టాఫీస్ నుంచి ప్రధాని మోదీ కార్యాలయానికి ఉత్తరాలు పంపించారు. 1978లో అప్పటి జనతా ప్రభుత్వం బీసీలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో బీపీ మండల్ కమిషన్ ఏర్పాటు చేసి 40 అంశాలతో కూడిన నివేదికను ప్రభుత్వానికి అందిస్తే 40 సంవత్సరాలు గడిచినా ఒక్క అంశం మినహా మిగతా సిఫారసులు అమలుకు నోచుకోలేదన్నారు.

సంక్షిప్త వార్తలు

టీబీజీకేఎస్ పిట్ కమిటీ ఎన్నిక

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఎ స్సార్పీ 1 గని టీబీజీకేఎస్ పిట్ కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. పిట్ కార్యదర్శిగా కురుమ వికాస్, సహాయ కార్యదర్శిగా మేడం తిరుపతి, జనరల్ షిఫ్ట్ కార్యదర్శులుగా పతి పాక రవిచంద్ర, వడ్డేపల్లి శ్రీనివాస్, రిలే ఏ సెక్రెటరీగా కొట్టే అరుణ్, రిలే బీ సెక్రెటరీ లుగా సతీశ్, కొమ్ము రవి, రిలే సీ సెక్రెటరీలుగా రమేశ్, తిరుపతి, కార్యవర్గ సభ్యులుగా బింగి వెంకటేష్, సంపత్, ప్రశాంత్, నరేష్, ప్రవీణ్, సాయి కృష్ణ, సమ్మయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, కేంద్ర కమిటీ నాయకులు పానుగంటి సత్తయ్య, పొగాకు రమేశ్, అన్వేష్‌రెడ్డి, పీ రవీందర్‌రెడ్డి, బత్తుల రాజేశం, వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ మండల కమిటీ

కోటపల్లి: బీజేపీ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా జనరల్ సెక్రెటరీ దుర్గం అశోక్ తెలిపారు. అధ్యక్షురాలిగా పెద్దింటి స్వప్న, జనరల్ సెక్రెటరీగా కందుల వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా వడ్లకొండ రాజేశ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పెద్దపల్లి పురుషోత్తం, కాశెట్టి నాగేశ్వర్‌రావు, పెద్దింటి పున్నంచందు, మంత్రి రామయ్య పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై శిక్షణ

మంచిర్యాలఅర్బన్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేసే స్కావెంజర్స్‌కు మంగళవారం పారిశుద్ధ్యంపై శిక్షణ ఇచ్చారు. ఎంఈవో మాలవీదేవి, రిసోర్స్ పర్సన్‌లు పీఎస్‌హెచ్‌ఎం, సుమలత, లక్ష్మీ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

బెల్లంపల్లి: ఐ డొనేషన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బెల్లంపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటివైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి వైద్యనిపుణుడు అంజయ్య 110 మందిని పరీక్షించగా 14 మందికి కంటిశుక్లాలు ఉన్నట్లు గుర్తించారు. వారికి లయన్స్‌క్లబ్ కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సత్యానారాయణ, కార్యదర్శి రాజన్న, కోశాధికారి ఆదర్శ్, స్థానికులు చిన్నరాజం, రాజేందర్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కోటపల్లి: కోటపల్లి కస్తూరిబా బాలికల విద్యాలయం, జూనియర్ కళాశాలలో తాత్కాలిక పద్ధతిన బోధించేందుకు అర్హులైన అధ్యాపకులు దరఖాస్తు చేసుకోవాలని బాలికల పాఠశాల ఎస్‌వో హరిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్హతల ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 12, 13 తేదీల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తెలుగు, ఇంగ్లిష్, బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో పీజీ బీఎడ్‌తో టెట్ క్వాలిఫై ఉండాలని, ఆంగ్ల మాధ్యమంలో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాలు

భీమారం: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులకు ఖరీఫ్ సీజన్‌కోసం సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందించనున్నట్లు ఏఈ సుధాకర్ మంగళవారం తెలిపారు. మండలానికి 100 క్వింటాళ్ల జీలుగ విత్తనాలను ఆగ్రోస్ సెంటర్‌లో సిద్ధంగా ఉన్నాయని, ఆసక్తిగల రైతులు పట్టాదారు పుస్తకాలతో వ్యవసాయశాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. 30 కిలోల బస్తా సబ్సిడీ పోను రూ.2,137 చెల్లించాలన్నారు.

తాండూర్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయాల్లో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి సుష్మా ఒక ప్రకటనలో తెలిపారు. 243 బస్తాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని, కావాల్సిన రైతులు వ్యవసాయ అధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

నెన్నెల: మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయంలో సబ్సిడీపై జీలుగు విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారిణి పుష్పాల సృజన తెలిపారు.

'ఆరోపణలు సరికాదు'

జన్నారం: బాధ్యతగల అధికారిగా ఉండి తనపై లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదని మాజీ ఎంపీటీసీ రియాజొద్దీన్ అన్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అడవిలో మట్టి తీశారని ఫిర్యాదు చేయగా రిజర్వ్ ఫారెస్ట్ కాదని చెప్పిన రేంజ్ అధికారి వారిపై ఎలా కేసు నమోదు చేశారని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

అసత్య ప్రచార పోస్టులు పెడితే చర్యలు

జన్నారం: సోషల్ మీడియాలో ఏదైనా అసత్య ప్రచారం, ఇతర వర్గాలను రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై గొల్లపెల్లి అనూష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్వేషపూరితమైన, ఇతరులను కించపరిచే విధంగా పోస్టుల్లో పెట్టినా చట్టపరమైన చర్యలు తీసుకోబడుతాయన్నారు.

దండేపల్లి: సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెడితే చర్యలు తప్పవని ఎస్సై తహసీనొద్దీన్ హెచ్చరించారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా విద్వేషపూరిత, వాఖ్యలు, రెచ్చగొట్టే పోస్టులు పెట్టడం, షేర్‌చేయడం వంటివి చేయకూడదన్నారు.

బస్‌పాస్‌లు ఉచితంగా అందించాలి

మంచిర్యాలఅర్బన్: ఆర్టీసీ బస్‌పాస్ చార్జీలను తగ్గించి విద్యార్థులకు ఉచితంగా పాస్‌లు అందించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బస్‌పాస్‌ల చార్జీలను పెంచి విద్యార్థులను విద్యకు దూరం చేసే ప్రమాదం తీసుకొస్తుందన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

దండేపల్లి: ప్రభుత్వపాఠశాలల్లో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ద్వారా నాణ్యమైన భోజనం అందించాలని వెల్గనూర్ కాంప్లెక్స్ హెచ్ఎం విజయలక్ష్మి అన్నారు. కాంప్లెక్స్ పరిధిలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల మధ్యాహ్న భోజన నిర్వాహకులకు మంగళవారం వెల్గనూర్ ఉన్నత పాఠశాలలో ఒక రోజు శిక్షణ ఇచ్చారు.

సీసీ కెమెరాలతో ప్రయోజనం

జన్నారం: కాలనీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం వలన ప్రయోజనం ఉంటుందని ఎస్సై గొల్లపెల్లి అనూష అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీలో కాలనీ వాసులు ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలను ప్రారంభించారు.

అవగాహన సదస్సు

భీమారం: మధ్యాహ్న భోజనంపై మంగళవారం మండల కేంద్రంలో ఉపాధ్యాయులు, ఏజెన్సీ నిర్వాహకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో వేణుగోపాల్, ఆర్‌పీఎం అప్పారావు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

మహాసభ విజయవంతం చేయాలి

పాతమంచిర్యాల: ఈ నెల 15న జిల్లా కేంద్రంలో నిర్వహించే టీయూసీఐ జిల్లా ప్రథమ మహాసభను విజయవంతం చేయాలని టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జాడి దేవరాజ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని టీయూసీఐ కార్యాలయంలో కార్మికులతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముంజంపల్లి సదయ్య, పొట్టాల మల్లేశ్, సీహెచ్ రమేశ్, చదువుల దేవయ్య, లక్ష్మణ్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ కేజీబీవీ బాలికల జూనియర్ కళాశాలలో విద్యాబోధనకు తాత్కాలిక పద్ధతిలో అతిథి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తున్నట్లు ప్రత్యేకాధికారి స్వప్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బైపీసీ కోర్సు బోధనకు ఎమ్మెస్సీ ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఎంఎల్‌టీ కోర్సు బోధనకు ఎమ్మెస్సీ మైక్రోబయోలజీ, బయో టెక్నాలజీ అర్హతతో ఇంగ్లిష్‌లో బోధించే అభ్యర్థులు కావాలన్నారు. ఆసక్తి కలవారు ఈనెల 12న మధ్యాహ్నం 2 గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

స్కావెంజర్లకు శిక్షణ

దండేపల్లి: మండలంలోని అన్ని పాఠశాలల స్కావెంజర్లకు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఐఎస్ నగేష్, సీసీవో మల్లేశ్, సీఆర్పీలు సురేందర్, రమేశ్, మెసెంజర్ పోచన్న, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించుకోవాలి

జన్నారం: భూ భారతి సదస్సులలో భూసమస్యలు పరిష్కరించుకోవాలని తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి అన్నారు. మంగళవారం మొర్రిగూడలో నిర్వహించిన సదస్సులో గ్రామస్తుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో ఎస్సై అనూష, ఆర్ఐ భానుచందర్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు కబ్జా చేస్తున్నారని ఫిర్యాదు

వేమనపల్లి: మండల కేంద్రంలోని బొగుడగూడెం నుంచి పాత కల్మలపేటకు వెళ్లే ఎంచరోడ్డు, బొగుడగూడెం నుంచి పాత గొర్లపల్లికి వెళ్లే రోడ్డు కబ్జా చేస్తున్నారని రైతులు మంగళవారం తహసీల్దార్ సంధ్యారాణికి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కుర్రు వెంకటేషం, మాజీ కోఆప్షన్ సభ్యుడు జాహెద్‌అలీ, నాయకులు కొండ బాపు, రవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి సింగరేణి సమస్యలు



మాట్లాడుతున్న జెట్టి శంకర్‌రావు

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికుల ప్రధాన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లామని ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు తెలిపారు. మంగళవారం నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యూనియన్ సెక్రెటరీ జనరల్ బీ జనక్ ప్రసాద్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి చర్చించారన్నారు. మారుపేర్లను క్రమబద్ధీకరించాలని, సొంతింటి పథకం అమలు చేయాలని, కార్పొరేట్ మెడికల్ బోర్డు రూల్స్‌ను మార్చాలని, కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని, తదితర సమస్యలపై కోరగా భట్టి విక్రమార్క స్పందిస్తూ సింగరేణి సీఎండీకి ఆదేశాలు జారీ చేశారన్నారు. సమావేశంలో ఆ యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షులు గరిగే స్వామి కలవేన శ్యామ్, ప్రధాన కార్యదర్శి ఏనుగు రవీందర్ రెడ్డి, నాయకులు తిరుపతి రాజు, భీమ్ రవి, లాగల శ్రీనివాస్, బ్రాంచ్ నాయకులు మెండె వెంకటి, వేల్పుల ప్రవీణ్, తోకల సురేష్, తిరుపతిపాల్గొన్నారు.

ప్రతీ నాయకుడు ఐదు మొక్కలు నాటాలి

జన్నారం: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపు మేరకు ప్రతీ బీజేపీ కార్యకర్త, నాయకులు ఐదు మొక్కలు నాటాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆకుల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మధుసూదన్ రావు, నాయకులు నల్ల రవీందర్ రెడ్డి, కొంతం శంకరయ్య, రమేశ్‌గౌడ్, పెద్ద ప్రభాకర్, మేడ నరహరి, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సందవేని పవన్, కిసాన్ మోర్చా అధ్యక్షులు బెడద గోపాల్, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు తిరుపతి, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు లక్ష్మీరాజం, తదితరులు పాల్గొన్నారు.

'ఆస్పత్రులను పట్టించుకోని యాజమాన్యం'

రామకృష్ణాపూర్: సింగరేణి ఆసుపత్రులను యాజమాన్యం పట్టించుకోవడం లేదని సీఐటీయూ బ్రాంచి అధ్యక్షుడు వెంకటస్వామి అన్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో మంగళవారం మాట్లాడుతూ కార్మికులు వారి కుటుంబసభ్యులకు మెరుగైన వైద్య సేవలందించాలన్న ఉద్దేశంతో ఏరియా ఆసుపత్రులు, డిస్పెన్సరీలను నిర్మించిన యాజమాన్యం వాటిలో వైద్యుల నియామకంపై దృష్టి సారించడం లేదన్నారు. డాక్టర్లు, మందులు, సరైన సదుపాయాలు లేక కార్మికులకు సింగరేణి ఆసుపత్రులపై నమ్మకం పోతోందన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం ఆసుపత్రుల నిర్వహణపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వడ్లకొండ ఐలయ్య, సంజీవ్, రమేశ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న వ్యాపారులు



మతిస్థిమితం లేని వ్యక్తితో వ్యాపారులు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని మార్కెట్ రోడ్డులో గల చౌరస్తాలో మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న ఓ వ్యక్తికి షాపుల యజమానులు తలనీలాలను తీయించి, స్నానం చేయించారు. కొత్త బట్టలు తొడిగించి మానవత్వం చాటుకున్నారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్డీవో హరికృష్ణ

నెన్నెల: భూ సమస్యల పరిష్కారానికి గ్రామాల్లో కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులను రైతులు, భూయజమానులు సద్వినియోగం చేసుకోవాలని బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ కోరారు. మంగళవారం కోణంపేట, గుండ్లసోమారం గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఆయన పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యల దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని తహసీల్దార్ మహేంద్రనాథ్, డీటీ ప్రకాష్, ఆర్ఐ సులోచనను ఆదేశించారు. కోణంపేటలో 49, గుండ్లసోమారంలో 50 , పుష్పాలవాయిపేటలో 6 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మారిన విద్యుత్ అధికారుల ఫోన్ నంబర్లు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో విద్యుత్ శాఖ అధికారుల ఫోన్ నంబర్లు మారినట్లు జిల్లా విద్యుత్ శాఖ అధికారి (ఎస్ఈ) గంగాధర్ తెలిపారు. బీఎస్ఎన్ఎల్ నంబర్లకు నెటవర్క్ సమస్యలుండడంతో కొత్తగా ఎర్‌టెల్ నెటవర్క్ నెట్‌వర్క్‌మ నుంచి మార్చడం జరిగిందన్నారు. విద్యుత్ సమస్యలు వస్తే కింది నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

అధికారులు	ఫోన్ నంబర్లు		
ఎస్ఈ	8712483913	కోటపల్లి	8712483984
డీఈఈ ఆపరేషన్		హాజీపూర్	8712484073
మంచిర్యాల	8712483946	కంట్రోల్ రూమ్ మంచిర్యాల	8712484100
బెల్లంపల్లి	8712484102	టెక్నికల్ బెల్లంపల్లి	8712484103
ఏడీఈ ఆపరేషన్		మంచిర్యాల టౌన్–2	8712484054
లక్సెట్టిపేట్	8712484041	ఏఈఈ	
చెన్నూర్	8712484099	జైపూర్	8712483970
బెల్లంపల్లిరూరల్	8712484159	దండేపల్లి	8712484003
మంచిర్యాలరూరల్	8712484096	జన్నారం	8712484020
మంచిర్యాల	8712484065	లక్సెట్టిపేట్	8712484033
ఏడీఈ హెచ్‌టీ మీటర్స్		మంచిర్యాల టౌన్–3	8712484063
మంచిర్యాల	8712483926	మంచిర్యాల టౌన్–1	8712484064
ఏఈఈ హెచ్‌టీ మీటర్స్		క్యాతన్‌పల్లి	8712484079
మంచిర్యాల	8712483927	మంచిర్యాలరూరల్	8712484080
మంచిర్యాల(ప్రొటెక్షన్)	8712483928	మందమర్రి	8712484089
ఏడీఈ ఎల్‌టీ మీటర్స్		బెల్లంపల్లి రూరల్	8712484110
మంచిర్యాల	8712483929	బెల్లంపల్లి టౌన్	8712484117
ఏఈఈ సీటీ మీటర్స్,		కాసిపేట	8712484132
మంచిర్యాల	8712483930	తాండూర్	8712484142
ఎల్ఎంసీ మంచిర్యాల	8712483945	భీమిని	8712484147
ఏఈ ఆపరేషన్		నెన్నెల	8712484154
భీమారం	8712483951	అసిస్టెంట్ ఇంజినీర్	
చెన్నూర్	8712483956	వేమనపల్లి	8712484156
కొమ్మెర	8712483976	ఏఈ కంట్రోల్ రూమ్, డీవో బెల్లంపల్లి	8712484161

విద్యార్థులకు వసతులు కల్పించాలి

తాండూర్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని మండల విద్యాధికారి మల్లేశం సూచించారు. మంగళవారం మండలంలోని తాండూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన, శానిటేషన్ వర్కర్లు, ప్రధానోపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ నిర్వహించారు. రిసోర్స్ పర్సన్లు శ్రీనివాస్, ఉమాదేవి, సంపత్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ప్రదీప్, ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రమైన భోజనం అందించాలి

జన్నారం: విద్యార్థులకు పరిశుభ్రమైన భోజనం అందించాలని కిష్టాపూర్ కాంప్లెక్స్ హెచ్ఎం గుండ రాజన్న అన్నారు. మంగళవారం కిష్టాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పిట్టల రాజరావు పాల్గొన్నారు.